
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి 5 మెదక్ జిల్లాల వార్తలు

ఆదివారం 14 జనవరి 2024

సీఐ లాలూనాయక్‌పై సస్పెన్షన్ వేటు

సంగారెడ్డి క్రైం, జనవరి 13: పటాన్‌చెరు సీఐ లాలూనాయక్‌పై సస్పెన్షన్ వేటు పడింది. డిసెంబరు 24న పటాన్‌చెరులో సాకిచెరువు వద్ద జరిగిన దాడి కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించి బాధితుడు అమీన్‌పూర్‌కు చెందిన నాగేశ్వర్‌రావు మరణానికి కారణమయ్యాడని తేలడంతో ఉన్నతాధికారులు ఆయనపై చర్యలు తీసుకున్నారు. ఆయన స్థానంలో శ్రీనివాస్‌రెడ్డికి ఇన్‌చార్జి సీఐగా బాధ్యతలు అప్పగిస్తూ సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.



లక్షపుష్పార్చనలో సిద్ధివినాయకుడు

వైభవంగా సిద్ధివినాయకుడి జన్మోత్సవాలు

న్యాల్‌కల్, జనవరి 13: రేజింతల్ సిద్ధివినాయకుడి జన్మోత్సవాలు అంగరంగవైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి లక్షపుష్పార్చన నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. నేడు స్వామివారి జన్మోత్సవాల సందర్భంగా ఫల, పంచామృతాభిషేకం, పూర్ణాహుతి, 15న స్వామివారికి కల్యాణమహోత్సవం నిర్వహిస్తున్నామని ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు వివరించారు.



వినాయకుడిని అర్చించడానికి తెచ్చిన పూలు

సంబరాల సంక్రాంతి



నేడు భోగి.. రేపు సంకాత్రి.. ఎల్లుండి కనుమ

● గాలిపటాలు, రంగులు, పూజాసామగ్రి దుకాణాలు కిటకిట

మెదక్ అర్బన్, జనవరి 13: సంక్రాంతి సంబరాలకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. వేడుకల్లో భాగంగా తొలిరోజు ఆదివారం భోగభాగ్యాల భోగిని ఘనంగా జరుపుకోనున్నారు. పిండి వంటలు సిద్ధం చేశారు. రంగవల్లులు, సంక్రాంతి నోములకు ఏర్పాట్లు చేసుకున్నారు. పూజాసామగ్రి, గాలిపటాల అమ్మకాలతో మార్కెట్లు కిటకిటలాడుతున్నాయి. పండుగకు ఇంటికి వెళ్లే వారితో బస్టాండ్లలో రద్దీ నెలకొన్నది. పండుగ తొలిరోజు ఆదివారం భోగి జరుపుకోనున్నారు. తెల్లవారుజామున భోగి మంటలు వేస్తారు. కొత్తగా పెళ్లైన అల్లుళ్లకు భోగి స్నానాలు చేయిస్తారు. చిన్నారులు ఆరోగ్యంగా ఉండాలని భోగి పండ్లను పోస్తారు.

సంక్రాంతి సందడి

సంక్రాంతి అంటే మకర సంక్రమణం అంటారు. ప్రపంచానికి ప్రత్యక్ష దేవుడు సూర్యుడు. పూర్వ రాశుల నుంచి ఉత్తరరాశిలోకి సూర్యుడు ప్రవేశించడాన్ని మకర సంక్రమణం అంటారు. సంవత్సరానికి 12 సంక్రాంతులు ఉంటాయి. అయితే పుష్యమాసంలో హేమంత రుతువులో మంచు కురిసే కాలంలో సూర్యుడు మకర రాశిలోకి మారగానే వచ్చే సంక్రాంతిని మకర సంక్రాంతి అంటారు. మకర సంక్రాంతి పర్వదినాన్ని సోమవారం వేడుకగా నిర్వహించుకునేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. ఈ రోజున భగవద్భక్తి పూజా కార్యక్రమాలతో ప్రతీ ఇంటా సంక్రాంతి లక్ష్మిని ఆహ్వానిస్తూ పొంగళ్లు పొంగిస్తారు. హరిదాసులు, గంగిరెద్దుల వాళ్లు ఇంటింటికి తిరుగుతూ హరినామస్మరణ చేస్తూ.. బసవన్నను ఆడిస్తూ.. సందడి చేస్తారు. రైతులు తాము పండించిన పంటలు సంవృద్ధిగా పండి ఇంటికి చేరవేసుకోవడంతో కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపే రోజుగా సంక్రాంతిని జరుపుకుంటారు.

నోములు, పూజల కనుమ

సంక్రాంతి సంబరాల్లో మూడోరోజు కనుమ పండుగ. తెల్లవారకముందే ముత్తైదువలు అందంగా ఆలంకరించుకొని సంక్రాంతి పూర్ణానికి నూలు, బెల్లం జోడించి చేసిన ఉండలు కానీ, నూల పొడి చక్కెర కానీ నైవేద్యంగా పెడతారు. సంక్రాతి నోములని 13 వస్తువులు (నోములు) రేగుపండ్లు, చిక్కుడు కాయలు వేసి సమర్పిస్తారు. బొట్టుపెట్టి ఒక్కొక్కరికీ నోము ఇస్తారు. ప్రజలందరికీ ఆహారాన్ని పండించే రైతులకు చేదోడువాదోడుగా ఉన్న పశువుల్ని పూజిస్తారు. యువతులు గొబ్బెమ్మల పాటలు పాడి నృత్యాలు చేస్తారు.



రంగవల్లులు.. గాలిపటాలు

సంక్రాంతి పండుగ వచ్చిందంటే రంగవల్లులకు ప్రత్యేక స్థానం. ఇళ్ల ముందు అందమైన ముగ్గులువేసి ముగ్గు మధ్యలో ఆవుపేడతో గొబ్బెమ్మలను తయారుచేసి అందులో గరక, పిండిమొక్కను పెట్టి, చుట్టూ నవధాన్యాలను పోపి రేగుపండ్లను పెడుతారు. సంక్రాంతి వేడుకల్లో ప్రధానమైనది గాలిపటాలను ఎగరవేయడం. చిన్నాపెద్ద తేడా లేకుండా పతంగులను ఎగురవేయడం అనాదిగా వస్తున్నది. జిల్లావ్యాప్తంగా పట్టణాలు, మండల కేంద్రాల్లో పతంగుల దుకాణాలు వెలిశాయి. రకరకాల గాలిపటాలు, మాంజాల అమ్మకాలు జోరందుకున్నాయి.



మా వాటా డబ్బు తిరిగివ్వండి

- పశుసంవర్ధకశాఖ ఆఫీసుకు లబ్ధిదారుల క్యూ
- కట్టిన డబ్బులు తిరిగివ్వాలని అధికారులపై ఒత్తిడి
- అప్పు చేసి డీడీలు చెల్లించిన గొల్ల కురుమలు
- గొర్రెల పంపిణీపై స్పష్టత ఇవ్వని కొత్త సర్కారు



మెదక్ అర్బన్, జనవరి 13: ఇదిగో గొర్రెలు.. అదిగో గొర్రెలంటూ గత బీఆర్ఎస్ సర్కార్ ఊరించి.. ఊరించి చివరకు గొల్ల కుర్మలకు అరకొర గొర్రెల యూనిట్లు పంపిణీ చేసింది. మొదటి విడత నామమాత్రంగానే పంపిణీ చేశారు. కనీసం రెండో విడతలోనైనా గొర్రెలొస్తాయని చూస్తున్న డీడీలు కట్టిన కాపరులకు నిరాశే ఎదురైంది. అసెంబ్లీ ఎన్నికల ముందు రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో కొందరికి గొర్రెలు ఇచ్చారు. ఇంతలోనే ఎలక్షన్ కోడ్ వచ్చి పంపిణీకి బ్రేక్ పడింది. ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ రావడంతో గొర్రెల కోసం డీడీలు చెల్లించిన వారి పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.

1,942 మంది ఎదురుచూపులు

ఒక్కో యూనిట్‌లో 20 గొర్రెలు, ఒక పొట్టేలు ఉంటాయి. యూనిట్‌కు గతంలో రూ.1.25 లక్షలు ఉండగా.. ఆ తర్వాత రూ.50 వేలు పెంచడంతో అది రూ.1.75 లక్షలకు చేరింది. యూనిట్ విలువ పెంపుతో సర్కార్ 75 శాతం అంటే రూ.1,31,250 రాయితీ కింద, లబ్దిదారుడు తన వాటా కింద డీడీ రూపంలో రూ.43,750 చెల్లించాల్సి ఉండేది. డీడీల విధానంలోనూ మార్పులు చేశారు. లబ్దిదారు బ్యాంకు ఖాతా నుంచే నేరుగా చెల్లింపుల విధానాన్ని ఆరు నెలల కిందట తీసుకొచ్చారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా రెండో విడతకు 7,184 మంది దరఖాస్తులు చేసుకోగా.. 6,774 మందిని అర్హులుగా ఎంపికయ్యారు. కొత్త విధానంలో 2,584 మంది లబ్దిదారులు తమ వాటా కింద రూ.11.30 కోట్లు చెల్లింపులు చేశారు. ఇందులో 642 మందికి మాత్రమే గొర్రెల యూనిట్లు అందజేశారు. మిగితా వారికి అప్పుడు... ఇప్పుడంటూ.. జ్యాపం చేస్తూ..వస్తున్నారు. కొత్త సర్కార్ వచ్చి నెల గడుస్తున్న గొర్రెల పంపిణీపై ఎలాంటి స్పష్టత ఇవ్వకపోడంతో డీడీలు కట్టి గొర్రెల అ ందని లబ్దిదారులు ఆందోళన చెందుతున్నారు. కొంత మంది తమ వాటా డబ్బులను తిరిగి ఇచ్చేయాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు.



ఆదేశాలు రాలేదు

గొర్రెల పంపిణీ పథకంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. జిల్లాలో రెండో విడతలో 2,584 మంది లబ్ధిదారులు డీడీలు చెల్లించారు. 642 మందికి గొర్రెల యూనిట్లు అందజేశాం. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా మిగిలిన వారికి అందజేస్తాం.

-విజయశేఖర్‌రెడ్డి, మెదక్ జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి



డీడీలు కట్టిన లబ్దిదారులకు గొర్రెలు లేదా వాటా డబ్బులు ఇవ్వాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషాకు వినతిపత్రం అందజేస్తున్న గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం నాయకులు



ఆస్తి పన్ను, నల్లా బిల్లు బకాయిలు

17.40 కోట్లు

- వసూళ్ల కోసం సంగారెడ్డిలో స్పెషల్ డ్రైవ్
- 10 మంది బిల్ కలెక్టర్లు.. రోజుకు రూ.30 వేల చొప్పున వసూలు
- బకాయిలు వసూలైతేనే జీతాలు
- 102 మంది నీటి సరఫరా సిబ్బందికి రెండు నెలలుగా అందని జీతాలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 13 : జిల్లా కేంద్రమైన సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను, నల్లా బిల్లు బకాయిలు పేరుకుపోయాయి. మున్సిపల్ సిబ్బంది వసూళ్లపై దృష్టిసారించకపోవడంతో బకాయిలు కోట్లకు చేరుకున్నాయి. బల్దియా ఆర్థిక పరిస్థితి కుదేలవడతో మున్సిపల్ కమిషనర్ బకాయిల వసూళ్లపై దృష్టిసారించారు. ఇందుకోసం ఔట్ సోర్సింగ్ పద్ధతిలో 10 మంది బిల్ కలెక్టర్లను నియమించారు.

ఆస్తి పన్ను రూ. 8 కోట్లు, నల్లా బిల్లు రూ. 9.4 కోట్లు

సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను బకాయిలు రూ.8 కోట్లు ఉన్నాయి. ప్రతీ సంవత్సరం ఏప్రిల్, మే నెలలో ఆస్తి పన్ను చెల్లిస్తే ప్రభుత్వం 5 శాతం రిబేట్ ఇస్తున్నది. అయినా సంగారెడ్డి మున్సిపల్ పరిధిలోని కొన్ని ప్రాంతాలవారు చెల్లించడం లేదు. వారి నుంచి తప్పనిసరిగా పన్ను వసూలు చేయాలని కమిషనర్ సుజాత బిల్ కలెక్టర్లను ఆదేశించారు. అలాగే నల్లా బిల్లు బకాయలు రూ.9.40 కోట్లు ఉన్నాయి. ఈ మున్సిపాలిటీ పరిధిలో 12 వేల నల్లా కనెక్షన్లున్నాయి. ఒక్కో కనెక్షన్‌కు ఇంటి యజమాని నెలకు రూ.150 చొప్పున చెల్లించాలి. నల్లా బిల్లు వసూళ్లకు మున్సిపల్ సిబ్బంది రాకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో నాలుగైదు సంవత్సరాలుగా చెల్లించలేదు. కమిషనర్ ఆదేశాలమేరకు బిల్ కలెక్టర్లు రెండు మూడు రోజులుగా తమకు కేటాయించిన ప్రాంతాలలో తిరుగుతున్నారు. ఒక్కో బిల్ కలెక్టర్‌కు ప్రస్తుతానికి మూడు, నాలుగు వార్డుల చొప్పున కేటాయించారు. సంగారెడ్డి పాత పట్టణ పరిధిలో నల్లా బిల్లు చెల్లించడానికి ముందుకురానివారి కనెక్షన్‌ను సిబ్బంది తొలగిస్తున్నారు. బిల్లు చెల్లించని తర్వాతే కనెక్షన్లను పునరుద్ధరిస్తున్నారు.

టార్గెట్ రూ. 30 వేలు

ప్రతీ బిల్ కలెక్టర్ ఒకరోజు రూ.30 వేల బకాయిలు వసూలు చేయాలని అధికారులు టార్గెట్ విధించినట్లు తెలిసింది. బకాయిలను వసూలు చేస్తేనే జీతాలు చెల్లిస్తామని షరతు విధించడం గమనార్హం. మరోవైపు టౌన్ లెవల్ ఫెడరేషన్(టీఎల్ఎఫ్) ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా పనిచేస్తున్న 102 మంది సిబ్బందికి రెండు నెలలుగా జీతాలు ఇవ్వలేదని తెలిసింది. బకాయిలు వసూలైతేనే సిబ్బందికి రెగ్యులర్‌గా జీతాలు ఇచ్చే వీలున్నదని అధికార వర్గాలు తెలిపాయి. సంక్రాంతి పండుగ ఉన్నా తమకు జీతాలు చెల్లంచకపోవడంపై ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తూప్రాన్‌లో కోడిపందాలు

పోలీసుల దాడి.. నగదు, సెల్‌ఫోన్లు, పందెంకోళ్ల స్వాధీనం

తూప్రాన్, జనవరి 13: నివాసాల మధ్య నిర్వహిస్తున్న కోడిపందేల కేంద్రంపై పోలీసులు దాడిచేసి నగదు, సెల్‌ఫోన్లు, పందెంకోళ్లను స్వాధీనం చేసుకున్నారు. మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. తూప్రాన్ ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ పట్టణంలోని మండల కార్యాలయానికి సమీపంలో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. పోలీసులు దాడిచేసి 5 పందెం కోళ్లు, రూ. 17,730 పట్టుబడ్డాయి. పందెం పోటీల్లో పాల్గొన్న ముగ్గురి వద్ద మొబైల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తూప్రాన్‌లో నివాసముండే కండెల దుర్గయ్య (38), కండెలకార్తీక్ (18), వనంగంగన్న (50), వనంరామయ్య (60), బొబ్బిలి పోశెట్టి (42)ని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శివానందం వివరించారు.



పోలీస్‌స్టేషన్‌లో కట్టేసిన పందెం కోళ్లు

గిరిజన మహిళ ఆత్మహత్య.. కొడుకే చంపాడంటూ దాడి

- ఇంటికి నిప్పు పెట్టిన తల్లిగారింటివారి బంధువులు
- తండాలో ఉద్రిక్తత.. పోలీసుల బందోబస్తు



మృతురాలి బంధువులు తగులబెట్టిన ఆమె కొడుకు ఇల్లు

నర్సాపూర్, జనవరి 13: గిరిజన మహిళ ఆత్మహత్య చేసుకోగా కొడుకే చంపాడంటూ తల్లిగారింటి బంధువులు దాడిచేసి ఇంటిని తగులబెట్టారు. ఈ ఘటన మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం జయరాం తండాలో శనివారం ఉద్రిక్తతలకు దారితీసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జయరాం తండాకు చెందిన చక్రి(40) కొడుకు మోహన్ కొంతకాలంగా మద్యానికి బానిసై తల్లితో గొడవపడుతున్నాడు. ప్రతీరోజు గొడవలు జరుగుతుండడంతో మనస్తాపంతో శనివారం ఆమె ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న మృతురాలి తల్లిగారింటికి చెందిన బంధువులు పెద్దసంఖ్యలో వచ్చి జయరాంతండాలో ఆందోళనకు దిగారు. ఆమెను కొడుకే చంపాడంటూ ఆరోపిస్తూ ఇంటిపై దాడిచేసి వస్తువులను ధ్వంసం చేసి తగులబెట్టారు. దీంతో తండావాసులు ఎదురుతిరగడంతో ఉద్రిక్తత చోటుచేసుకున్నది. విషయం తెలుసుకున్న పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను శాంతింపజేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఆందోళన చేస్తున్నవారిని సముదాయిస్తున్న పోలీసులు

బీరంగూడ గుట్టపై కబ్జాల జోరు

- ప్రజాప్రతినిధుల అండతో రెచ్చిపోతున్న భూ మాఫియా
- గదులు నిర్మించి, ఇంటి నంబర్లు వేసి ప్లాట్ల విక్రయాలు
- అసైన్డ్ భూములనూ వదలని అక్రమార్కులు
- కుల సంఘాల పేరిట ప్రభుత్వ భూముల సంతర్పణ

పటాన్‌చెరు, జనవరి 13: బీరంగూడ గుట్టను ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ అధికారుల అండతో కబ్జా మాఫియా మింగేస్తున్నది. భ్రమరాంబా మల్లికార్జున ఆలయ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. ఆలయానికి ఆనుకుని ప్రభుత్వ భూమిలో రాత్రికిరాత్రి నిర్మాణాలు వెలుస్తున్నాయి. రెవెన్యూ కార్యాలయానికి కూత వేటు దూరంలోనే భూ కబ్జా తతంగం జరుగుతున్నా అడ్డుకోవాల్సిన అధికారులు కనీసం స్పందించడం లేదు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో స్వయంభు భ్రమరాంభ మల్లికార్జునస్వామి వెలసిన బీరంగూడ గుట్ట చుట్టూ సర్వే నంబర్ 993లో మొత్తం 60 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూములను కొందరు అక్రమార్కులు చెరబడుతున్నారు. ఇప్పటికే గుట్ట చుట్టూ పెద్దఎత్తున కాలనీలు ఏర్పడి కాంక్రీటు అరణ్యంలా మారిపోయింది. దీంతో పక్కనే ఉన్న గుట్టపై భూ మాఫియా కన్నుపడింది. కాలనీలను ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములను చెరబట్టి ప్లాట్లుగా చేసి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఆలయాన్ని తీర్చిదిద్దేందుకు గతంలో దేవాదాయశాఖ మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించింది. ఆలయాన్ని అభివృద్ధిచేసి భారీ కోనేరు నిర్మించాలని ప్రతిపాదించారు. ఉద్యానవనం, భక్తులకు కాటేజీల నిర్మాణం, పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం గుట్ట పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని ఇవ్వాలని ఆలయ అధికారులు ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇదంతా ఆచరణలోకి రాకముందే విలువైన స్థలాలు కరిగిపోతున్నాయి. కొందరు ప్రజాప్రతినిధులు ఆలయం పక్కన ప్రభుత్వ భూములను కులసంఘాలకు కేటాయించడం వివాదాస్పదంగా మారింది. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఆలయ విస్తరణకు ఉపయోగపడే భూములను సంతర్పణ చేయడం ఏమిటని భక్తులు వాపోతున్నారు. అంతేకాకుండా గుట్టపైన ఎక్కడ చూసినా మట్టి, ఇసుక, కంకర, రాళ్లను కుప్పలుగా పోసుకుని విక్రయించే అడ్డాలు వెలిశాయి. అంతేకాకుండా ట్రాన్స్‌పోర్టు వ్యాపారులు తమ లారీలు, జేసీబీలను పార్క్ చేస్తున్నారు. గుట్ట మొదట్లో ఓ ప్రజాప్రతినిధి అనుచరులమని చెప్పుకుంటూ అసైన్డ్ భూముల్లో గదులు నిర్మించి, ఇంటి నంబర్లు వేసి అమ్ముకున్నారు. అసైన్డ్ భూమికి పక్కనే ఉన్న పట్టా నంబర్ వేసి రిజిస్టర్ చేసిన స్థలాలకు ఏకంగా టౌన్‌ప్లానింగ్ అధికారులు ఇంటి నిర్మాణ అనుమతులు జారీ చేశారు. గోశాలకు వెళ్లే దారిలో పెద్దఎత్తున కబ్జాలు జరిగాయి. ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. గతంలో రెవెన్యూ సిబ్బంది కూల్చిన కట్టడాలను రాత్రికిరాత్రే అదే చోట తిరిగి నిర్మించుకుంటున్నారు.

అధికారులు అలసత్వం

అసైన్డ్ భూముల్లో నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు, అక్రమ కట్టడాలపై ఇంటి నంబర్లు వేసినందుకు మున్సిపల్ అధికారులు స్పందించాల్సి ఉండగా ఏ ఒక్కరు చర్యలకు పూనుకోవడం లేదు. పైగా సదరు గదులకు ట్రాన్స్‌కో ఏకంగా కరెంటు మీటర్లను ఇవ్వడం గమనార్హం. కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురవుతున్నా ఇంతవరకు కనీసం ఒక్క ల్యాండ్ గ్రాంబింగ్ కేసు నమోదు కాలేదు. బీరంగూడ భూముల కబ్జా వ్యవహారంలో జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులను స్థానిక రెవెన్యూ సిబ్బంది తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. కబ్జాలను తొలగించాలని అధికారులు ఆదేశిస్తే మొక్కుబడిగా కూల్చివేతలకు పాల్పడి కొన్నిరోజుల తరవాత తిరిగి నిర్మించుకునే వెసులుబాటు ఇస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో గుట్ట చుట్టూ పెద్దఎత్తున స్థలాలను కబ్జా చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.



బీరంగూడ గుట్టపై కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలు

కబ్జాలు చేస్తున్నవారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం

బీరంగూడలో సర్వే నంబర్ 993లోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. అక్రమ కట్టడాలను, కబ్జాలను ఉపేక్షించే ప్రసక్తేలేదు. అసైన్డ్ భూముల్లో నిర్మాణాలను గుర్తించి తొలగిస్తాం పదే పదే కబ్జాలకు పాల్పడేవారిని గుర్తించి ల్యాండ్‌గ్రాబింగ్ కేసులు నమోదు చేస్తాం. కబ్జాల వ్యవహారం జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.

-గౌరీవత్సల, అమీన్‌పూర్ తహసీల్దార్

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఏపీజీవీబీ మేనేజర్



గౌరారంలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం

వర్గల్, జనవరి 13 : వర్గల్ మండలం గౌరారంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర శనివారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలపై గౌరారం ఏపీజీవీబీ మేనేజర్ నర్సింహులు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీఎం సురక్ష, పీఎం జీవన్ జ్యోతి, అటల్‌పెన్షన్, ఆరోగ్యశ్రీ, ఆవాస్ యోజన, పీఎం కిసాన్‌సమ్మాన్ నిధి, ఆరోగ్య సేవలు, గ్యాస్ ఉజ్వల్ యోజన, వ్యవసాయానికి సంబంధించిన పథకాలపై వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం పంపించిన 2024 సంవత్సరం క్యాలెండర్, బుక్‌లెట్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వినోద నర్సింహారెడ్డి, బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మఠం మహిపాల్ యాదవ్, మహిళా సంఘం సీసీ పద్మలత, గ్రామపంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్, నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి

● వర్గల్ మండలం మజీద్‌పల్లిలో ఘటన



గాలం జంపులు(ఫైల్)

వర్గల్, జనవరి 13 : ప్రమాదవశాత్తు బావిలో పడి వర్గల్ మండలం మజీద్‌పల్లి గ్రామానికి చెందిన వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం చోటు చేసుకున్నది. బేగంపేట ఎస్‌ఐ అరుణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మజీద్‌పల్లికి చెందిన గాలం జంపులు(55) మేస్త్రిపని చేసుకుంటూ జీవిస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఇంటివద్ద నిద్రించగా అర్ధరాత్రి కాలకృత్యాలు తీర్చుకోవడం కోసం ఇంటి సమీపంలో ఉన్న బావి వద్దకు వెళ్లగా ప్రమాదవశ్యాత్తు బావిలో జారి పడి మృతి చెందాడు. భార్య స్వరూప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అనారోగ్యంతో బాధపడుతూ వ్యక్తి బలవన్మరణం



మృతి చెందిన రమేష్

సిద్దిపేట అర్బన్, జనవరి 13 : సిద్దిపేట అర్బన్ మండలం బక్రీ చెప్యాల గ్రామానికి చెందిన వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ శనివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బక్రీ చెప్యాల గ్రామానికి చెందిన రమేష్ (36) కొంతకాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. మందులు వాడినా తగ్గకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. దీంతో పొన్నాల సమీపంలోని రైల్వే ట్రాక్ పక్కన చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి సుదర్శన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులకు తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, కొడుకు ఉన్నారు.

అందని పాల బిల్లు.. ఆందోళనలో పాడి రైతులు

మద్దూరు, జనవరి 13 : మద్దూరు మండలంలోని లద్నూరు గ్రామ విజయ డైరీ పాల కేంద్రం రైతులకు ఒకటిన్నర నెలలుగా పాలబిల్లు అందకుండా పోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై పాడి రైతులు శనివారం స్థానిక విలేకరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పదిహేను రోజులకోమారు పాలబిల్లు చెల్లించే వారని , ప్రస్తుతం పాలబిల్లు చెల్లించక నెల పదిహేను రోజులు దాటిందని సంక్రాంతి పండుగ వచ్చినా పాల బిల్లు అందించకపోవడంతో ఆందోళనగా ఉందని అసహనం వ్యక్తం చేశారు. ఇటీవల పాలల్లో ఉప్పు కలుస్తోందని కేంద్రం నుంచి అన్ని పరీక్షలు నిర్వహించి తీసుకెళ్లిన పాలను తిరస్కరించి పారబోయడంతో పాటు పాలను తీసుకోవడానికి నిరాకరించిన సందర్భంగా చేసిన ధర్నా మేరకు చేర్యాల పాలకేంద్రం మేనేజర్ స్పందించారన్నారు. అయితే ప్రతీ 15 రోజులకోమారు చెల్లించే పాల బిల్లు ఇంకా అందకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. సంక్రాంతి పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని పాల బిల్లు చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ సిద్దిపేట అర్బన్ మండల మహిళా అధ్యక్షురాలిగా రూప

సిద్దిపేట అర్బన్,జనవరి 13: సిద్దిపేట అర్బన్ మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాల గ్రామానికి చెందిన నరాల రూపను నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి శనివారం తెలిపారు. ఈ మేరకు నియామక పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన రూప మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని కాపాడుతానని తెలిపారు.

బస్సు మంటల్లో మసైపోయి..

గద్వాల జిల్లా బీచుపల్లి వద్ద ప్రైవేటు బస్సు బోల్తా.. చెలరేగిన మంటలు.. మహిళ సజీవ దహనం


మంటల్లో పూర్తిగా కాలిపోయిన బస్సు, ఇన్‌సెట్లో... మాలతి(ఫైల్)

గద్వాల, గద్వాల క్రైం /ఎర్రవల్లి, నార్సింగ్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బోల్తాపడ్డ ఆ బస్సుకు అంటుకున్న మంటలు పెద్దవి కాకమునుపే ప్రయాణికుల్లో కొందరు ఎలాగో అలా బయటపడ్డారు. చాలామందిని స్థానికులే రక్షించారు. ఒక్క మహిళ మాత్రం ఆ బస్సులోనే ఉండిపోయింది. రాకాసి మంటలు కోరలు చాస్తూ బస్సు అంతటా వ్యాపించాయి. ఆ మంటల్లో ఆమె కాలిబూడిదై పోయింది. ఈ హృదయవిదారక ఘటన గద్వాల జిల్లాలో జరిగింది. హైదరాబాద్ నుంచి చిత్తూరు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు శనివారం తెల్లవారు జామున బీచుపల్లి-ఎర్రవల్లి మధ్య బోల్తా పడింది. ఆ వెంటనే బస్సు ముందు భాగంలో మంటలంటు న్నాయి. మృతురాలిని ఏపీలోని చిత్తూరు జిల్లాకు చెందిన మాలతి (45)గా గుర్తించారు. పోలీసుల వివ రాల ప్రకారం.. శుక్రవారం రాత్రి 11 గంటలకు ఓ ప్రైవేటు బస్సు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి నుంచి చిత్తూరుకు బయలుదేరింది. బస్సుల్లో 42 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. హైదరాబాద్ నుంచి జడ్చర్ల దాబా దాకా ఒక డ్రైవర్ బస్సు నడి పాడు. తర్వాత ఒంటి గంట సమయంలో స్టీరింగ్ రెండో డ్రైవర్ తీసుకున్నాడు. బీచుపల్లి దాటిన తర్వాత, పదవ బెటాలియన్ సమీపంలో తెల్లవారుజా మున 2.30 గంటలకు బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ప్రయాణికులు ప్రాణభయంతో కేకలు వేశారు. పక్కనే ఉన్న హార్వెస్టర్ గ్యారేజీ కార్మికులు, పెట్రోల్ బంక్ వర్కర్లు హుటాహుటిన స్పందించారు. బస్సు అద్దా లను పగులగొట్టి ప్రయాణికులను కాపాడారు. పోలీ సులు కూడా సహాయక చర్యలు చేపట్టారు.ఆ వెంటనే బస్సులో మంటలు చెలరేగాయి. మంటల్లో మాలతి అనే ప్రయాణికురాలు చిక్కుకుపోయారు. ఆమె చెయ్యి బస్సు సీటు సందులో ఇరుక్కుపోవడంతో తప్పించుకునేందుకు వీల్లేకపోయినట్లు తెలుస్తోంది. కాపాడండి అంటూ ఆమె ఆర్తనాదాలు చేస్తున్నా, అప్పటికే మంటలు తీవ్రం కావడంతో ఎవరూ ఆమెను రక్షించే సాహసం చేయలేకపోయారు. అందరి కళ్ల ముందే ఆమె సజీవ దహనమయ్యారు. మాలతిది చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం, పుత్తమర్ల గ్రామం. ఆమె హైదరాబాద్ రాజేంద్రనగర్ లోని రైస్ రీసెర్చ్ సెంటర్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నారు. భర్త శ్రీనివాస్ కూడా హైదరాబాద్ లోనే వ్యాపారం చేస్తుండటంతో ఆ కుటుంబం నగరం లోని లంగర్‌హౌజ్‌లో ఉంటోంది. భర్త శ్రీనివాస్ తల్లి అనారోగ్యానికి గురవ్వడంతో రెండ్రోజుల క్రితం ఆమె చిత్తూరుకు వెళ్లిపోయారు. మాలతి కూడా శుక్రవారం రాత్రి బస్సులో సొంతూరుకు ప్రయాణమయ్యారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఘటన జరగ్గా, ఉదయం ఏడు గంటల దాకా మాలతి మృతదేహం కాలుతూనే ఉంది.. తన కళ్ల ముందే మాలతి మంటల్లో సజీవదహనమైందని గద్వాల వాస్తవ్యుడు కలీం అనే ప్రత్యక్ష సాక్షి చెప్పారు. హైద రాబాద్ నుంచి ఊరికి వెళుతుండగా బస్సుకు మంట లంటుకోవడాన్ని గమనించి అక్కడికి వెళ్లాలని ఆయన చెప్పారు. కాగా డ్రైవర్ నిద్రమత్తే బస్సు ప్రమాదానికి కారణం అని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. 36 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఆరుగురు ప్రయాణికులు, ఒక డ్రైవ ర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తర లించారు. ఘటన స్థలంలోనే మాలతి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్ప గించారు. గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు కృష్ణమోహ న్‌రెడ్డి, విజయుడు ఘటనాస్థలికి వెళ్లారు.

గతంలోనూ ఇదే తరహా ఘటనలు

ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలో గతంలోనూ ఇలాంటి ప్రమాదాలు జరిగాయి. 2002 సెప్టెంబరు 5న గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం కోదండాపురం వద్ద హైదరాబాద్ నుంచి కడప జిల్లా రాయచోటికి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగాయి. ఈ బస్సులో ప్రయాణిస్తున్న 31 మందిలో 13 మంది చనిపోయారు. మరో 18 మందికి తీవ్రగాయాల య్యాయి. 2013 అక్టోబరు 30న బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న జబ్బార్ ట్రావెల్స్‌కు చెందిన వాల్వో బస్సు కొత్తకోట మండలం పాలెం వద్ద కల్వ ర్టును ఢీకొని రాసుకుపోవడంతో మంటలు చేలరేగి బస్సుకు మంటలంటుకున్నాయి.. ఈ ఘోర దుర్ఘట నలో 45 మంది సజీవదహనం అయ్యారు.

భార్య ఆత్మహత్య..? భర్త హత్య..?

- అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి
- ఆమె బంధువుల దాడి.. చనిపోయిన భర్త
- అచ్చంపేటలో దారుణం.. ఇరు కుటుంబాల్లో విషాదం


సింధు, నాగార్జున (ఫైల్)

అచ్చంపేట, జనవరి 13 : అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత చనిపోయింది. కుటుంబ కలహాలు, వర కట్నం, లైంగిక వేధింపుల ఆరోపణలు ఆమె మరణం చుట్టూ అలుముకున్నాయి. కట్టుకున్నోడి వల్లనే తమ బిడ్డ చనిపోయిందని ఆగ్ర హించిన యువతి బంధువులు ఆమె భర్తపై దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కారణమో తెలి యదు కానీ.. అతడు చనిపోయాడు. దీంతో ఇరు కుటుంబాల్లో విషాదం నిండింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన సింధు(26)కు పట్టణంలోని శ్రీరాం(స రిరాం) ఆస్పత్రిలో పని చేస్తున్న ఖమ్మం జిల్లాకు చెందిన నాగార్జునతో పరి చయం ఏర్పడి, ప్రేమగా మారింది. మూడేళ్ల క్రితం వీరు హైదరాబాద్‌లోని ఆర్య సమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. కొంత కాలం అక్కడే ఉండి తర్వాత అచ్చంపేటకు వచ్చి శ్రీరాం ఆస్పత్రిలో పని చేస్తున్నారు. ఏడాది క్రితం దంప తుల మధ్య గొడవలు జరగడంతో సింధు.. బిజినేపల్లిలోని అమ్మమ్మ గారి ఇంటికి వెళ్లిపోయింది. నాగార్జున పోలీసులను ఆశ్రయించడంతో ఆమె తిరిగి వచ్చింది. ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవడం, డబ్బు కోసం భర్త వేధింపుల నేపథ్యంలో ఇరువురి మధ్య మళ్లీ గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి సింధు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. కొన ఊపిరితో ఉన్న ఆమెకు భర్త నాగార్జున.. శ్రీరాం ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా సింధు చనిపోయింది. ఈ విషయాన్ని నాగా ర్జున.. సింధు కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో ఆమె బంధువులు ఒక వాహనంలో అంబులెన్స్ వద్దకు చేరుకున్నారు. నాగార్జునను తమ వాహ నంలో ఎక్కించుకొని తీవ్రంగా దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కార ణమో తెలియదు గానీ.. నాగార్జున చనిపోయాడు. అతడిని కొట్టి చంపేశా రని నాగార్జున తల్లి, చెల్లెలు ఆరోపిస్తున్నారు. కాగా, తమ కూతురిని చంపి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని సింధు తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యా దులో పేర్కొన్నారు. నాగార్జున, డాక్టర్ కృష్ణ, అతడి భార్య హైమావతి ఇదంతా చేశారని చెప్పారు. డాక్టర్ కృష్ణ తమ కూతురిని పలుమార్లు లైంగి కంగా వేధించాడని తెలిపారు. నాగార్జున మృతిపై అతడి కుటుంబీకులు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నీటి బకెట్‌లో పడి చిన్నారి మృతి

కొత్తూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఓ 16 నెలల చిన్నారి ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి బకెట్‌లో పడి మృతిచెందింది. ఈ విషాదకర ఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూర్‌లో శనివారం జరిగింది. బిహార్‌కు చెందిన ధర్మేందర్ దంపతులు కొత్తూర్ నారాయణగూడ కాలనీలో నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్న ధర్మేందర్ శనివారం పనికి వెళ్లాడు. అతని భార్య ఇంటి పనుల్లో నిమగ్నమై ఉండగా పెద్ద కుమార్తె రుయూ (16 నెలల) ఆడుకుంటూ వెళ్లి బాత్‌రూంలోని నీటి బకెట్‌లో పడిపోయింది. నీటి బకెట్‌లో చిన్నారి మృతి చెంది కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

అప్పులు తీర్చలేక యువ రైతు ఆత్మహత్య

ఖానాపూర్, జనవరి 13 : పత్తి పంట దిగుబడి రాకపోవడం, అప్పులు పెరిగిపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువ రైతు ఆత్మహత్య చేసు కున్నాడు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం చందునాయక్ తండాకు చెందిన గుగ్లావత్ శ్రీకాంత్ (26) రెండు ఎకరాల్లో పత్తి వేశాడు. ఈ సారి ఆశించినంత దిగుబడి రాలేదు. దీనికి తోడు తన అక్క పెళ్లి కోసం చేసిన రూ.3 లక్షల అప్పు ఎలా తీర్చాలో తెలియక నిత్యం మథన పడేవాడు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

గుంతలోకి 3 వాహనాలు.. తల్లి, కొడుకు దుర్మరణం!

- ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టిన కారు
- అదుపుతప్పి ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొన్న ఆటో
- 3 వాహనాలూ గుంతలోకి.. కారులోని తల్లి, కుమారుడి మృతి

శంషాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఒక వాహనం అదుపు తప్పడం.. ఆ వాహనంతో పాటు మరో రెండు వాహనాలను ప్రమాదం బారిన పడేసింది! మూడు వాహనాలూ రోడ్డు పక్కన ఓ గుంతలో పడ్డాయి. ప్రమాదానికి గురైనవి కారు, ఆటో, బైక్! ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న తల్లి, కొడుకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ఒకరు, బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడ్డారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ఘాంసిమియాగూడ వద్ద ఈ ప్రమాదం సంభవించింది. శంషాబాద్ రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. కాప్రా మునిసిపాలిటీ శ్రీరాంనగర్‌కు చెందిన బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ సైంటిఫిక్ ఆఫీసర్ మెరువ ఆదిశేషారెడ్డి(57), తల్లి రాములమ్మ(88)తో కలసి కారులో హైదరాబాద్ నుంచి నంద్యాలకు వెళుతున్నారు. ఘాంసిమియాగూడ వద్దకు రాగానే కారు అదుపుతప్పి ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టింది. ఫలితంగా ఆటో అదుపుతప్పి దాని ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొంది. ఫలితంగా మూడు వాహనాలు ఒకదాని వెంట మరొకటి హైదరాబాద్-బెంగుళూరు జాతీయ రహదారి విస్తరణ పనుల కోసం నిర్మించిన కల్వర్టులో బోల్తాపడ్డాయి. ప్రమాదంలో కారులో ఉన్న ఆదిశేషారెడ్డి, రాములమ్మ అక్కడికక్కడే మృతిచెందారు. బైక్‌పై ఉన్న గొల్ల ఆంజనేయులు, వెనుక కూర్చున్న పద్నాలుగేళ్ల బాలిక, ఆటోడ్రైవర్ రాయన్నగూడ సిద్ధయ్య గాయపడ్డారు. ఆటోలో ఉన్న మరో ఇద్దరు రోడ్డుపక్కనే పడిపోగా వారికి ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తల్లీకుమారుల మృతదేహాలను కల్వర్టు నీటిలో నుంచి బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

పండుగ సరుకుల కోసం వచ్చి.. పరలోకాలకు!

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చేర్యాల, జనవరి 13: సంక్రాంతి పండుగకు సరుకులు కొనేందుకు బయటికి వచ్చిన మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కాటర్‌పిల్లర్ మెషీన్ ఆపరేటర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం దొమ్మాట గ్రామానికి చెందిన చల్లా లక్ష్మి(39) శనివారం చేర్యాలకు పండుగ కోసం సరుకులు కొనేందుకు వచ్చింది. తర్వాత ఇంటికి వెళ్లేందుకు చూస్తుండగా తమ ఇంటి సమీపంలోని బంధువు కనకారెడ్డి కలిసి టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై దొమ్మాటకు వెళ్తూ ఎక్కించుకున్నాడు. ఇటు జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పట్టణ శివారులో కల్వర్టు నిర్మాణం జరుగుతోంది. అక్కడ చెవులకు ఇయర్ ఫోన్స్ పెట్టుకొని కాటర్ పిల్లర్ మెషీన్‌తో ఆపరేటర్ నిర్ల క్ష్యంగా కంకర మిశ్రమాన్ని చదును చేస్తూ వెనక వైపునకు తోలుతున్నాడు. ఇంతలో వెనక నుంచి వస్తున్న కనకారెడ్డి బండి అదుపు తప్పడంతో ఇద్దరూ కిందపడిపోయారు. అది గమనించని ఆపరేటర్ మెషీన్‌ను లక్ష్మి పైనుంచి తీయ డంతో ఆమె మృతి చెందింది. కనకారెడ్డికి తీవ్రగాయాల య్యాయి. కాగా, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని మృతురాలి కుటుంబీకులు, బంధు వులు చేర్యాల పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. జనగామ-సిద్దిపేట రహదారిపై బైఠాయించారు.

పతంగి ఎగురవేస్తుండగా విద్యుత్తు షాక్

- అత్తాపూర్‌లో 11 ఏళ్ల బాలుడి దుర్మరణం
- రైలు పట్టాలపై పడిన గాలి పటం
- నవాంద్గీ స్టేషన్‌లో రైలు ఢీకొని బాలుడి మృతి

రాజేంద్రనగర్/బషీరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): భవనంపై ఉన్న ఏసీ కాపర్ పైప్‌లైన్‌ను విద్యుత్ ప్రసారం జరిగి.. కరెంటు షాక్‌తో ఓ బాలుడు చనిపోయాడు. రాజేం ద్రనగర్‌లో ఈ ఘోరం జరిగింది. అత్తాపూర్ రాంబాగ్ మల్లయ్య టవర్స్ సమీపంలో మహారాష్ట్రకు చెందిన అభిషేక్ కుటుంబం ఉంటోంది. అభిషేక్ సోదరుడు మూడేళ్ల క్రితం చనిపోయాడు. అభిషేక్ వదిన చాలారోజుల క్రితం ఎటో వెళ్లిపోయింది. దీంతో వారి కుమారుడు తనిష్క్(11) పెద నాన్న అభిషేక్ వద్దే ఉంటున్నాడు. సంక్రాంతి సందర్భంగా అభిషేక్ కుమారుడు మోహిత్ పతంగి ఎగురవేసేందుకు మల్లయ్య టవర్స్ ముందు ఉన్న లక్ష్మీవాణి టవర్స్ పైకి వెళ్లాడు. అతడితో తనిష్క్ కూడా వెళ్లాడు. లక్ష్మీవాణి అపార్ట్ మెంట్స్ పెంట్‌హౌస్‌పై ఇద్దరూ పతంగి ఎగురవేస్తుండగా అక్కడ ఏసీ ఔట్‌పుట్ కాపర్ పైప్‌లైన్‌కు తనిష్క్ తగిలాడు. దానికి అప్పటికే విద్యుత్తు ప్రసారం జరగడంతో షాక్‌తో చనిపోయాడు. గాలిపటం కోసం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని బాలుడు చనిపోయాడు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నవాంద్గీ రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం ఈ ప్రమాదం జరిగింది. బషీరాబాద్ మైనారిటీ కాలనీకి చెందిన అస్లామ్ కుమారుడు అబుజార్(9) గాలి పటం ఎగరేస్తున్నాడు. అది తెగి ఇంటి సమీపంలోనే ఉన్న రైలు పట్టాలపై పడటంతో పతంగి తీసుకునేందుకు బాలుడు పరుగు తీశాడు. అప్పటికే స్టేషన్‌లో గూడ్స్ రైలు ఆగి ఉండటంతో దాని కింది నుంచి దూరి అటువైపు వెళ్తుం డగా మరో ట్రాక్‌పై వస్తున్న రైలు ఢీకొట్టింది.

చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలి

● డీడీఎస్ జాయింట్ డైరెక్టర్ గిరిధర్‌బాబు


సమావేశంలో మాట్లాడుతున్న డీడీఎస్ జాతర నిర్వాహకులు

జహీరాబాద్, జనవరి 13: చిరుధాన్యాల సాగును కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాలని డీడీఎస్ జాయింట్ డైరెక్టర్ గిరిధర్‌బాబు పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి ఫిబ్రవరి 12వరకు డీడీ ఎస్ ఆధ్వర్యంలో పాతపంటల జాతర(జీవ వైవిధ్య) ఉత్సవాలను చేప ట్టనున్న నేపథ్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 23 ఏళ్లుగా జహీరాబాద్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో జీవ వైవిధ్య జాతరను నిర్వహిస్తూ చిరుధాన్యాల సాగుపై రైతులు ఆసక్తి చూపేవిధంగా చైతన్యం చేస్తున్నామన్నారు. వాణిజ్య పంటలను సాగుచేసే రైతులకు పాలకులు ప్రాధాన్యం కల్పి స్తుండడంతో చిరుధాన్యాలను సాగుచేసే రైతులను గుర్తించకపోవ డంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. ఈ ఏడాది శాస్త్రవేత్తలను, మేధావులను, అధికారులను, ప్రజాప్రతినిధులను జాతరలో పాల్గొనేలా కృషిచేస్తున్నామన్నారు. చిరుధాన్యాలకు మార్కెట్లో డిమాండ్ ఉన్నప్ప టికీ ప్రజల అవసరాలకు అనుగుణంగా మార్కెట్లో లభించడం లేదని చెప్పారు. డీడీఎస్ ఆధ్వర్యంలో జహీరాబాద్ ప్రాంతంలో 30 ఏళ్లుగా చిరుధాన్యాల సాగును ప్రోత్సహించడంతోపాటు వాటి గురించి రైతు లకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. నెలరోజుల పాటు ఉత్సాహభరి తంగా కొనసాగే జాతరలో అందరు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డీడీఎస్ ఉద్యోగులు, జాతర నిర్వా హకులు జనరల్ నర్సమ్మ, మాణిక్యం, చుక్కమ్మ, లక్ష్మమ్మ, మొగులమ్మ, తదితరులు పాల్గొన్నారు.

22 గ్రామాల్లో పాతపంటల జాతర

జహీరాబాద్ నియోజకవర్గంలోని జహీరాబాద్, మొగుడంపల్లి, కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఈ నెల 14 నుంచి ఫిబ్రవరి 12 వరకు 22 గ్రామాల్లో 24వ పాతపంటల జాతరను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. అందులో భాగంగా 14న మొగుడంపల్లి మండలంలోని జాడిమల్కాపూర్ గ్రామంలో ప్రాంభమవుతుందన్నారు. 16న సిద్దాపూర్, 17న గొట్టిగార్‌పల్లి, 18న శేఖాపూర్, 19న జంబ్గితండా, 20న లచ్చినాయక్‌తండా, 22న ఒంటెలగడ్డతండా, 23న జీడిగడ్డతండా, 25న ఉప్పర్‌పల్లితండా, 26న మన్నాపూర్, 27 జాంగారిబౌలితండా, 29న అర్జున్‌నాయక్‌తండా, మూడ్‌తండా, 31న జహీరాబాద్, ఫిబ్రవరి 1న అల్గోల్, 2న పోట్టిపల్లి, 3న రేజింతల్, 5న హుసెల్లీ, గుంజోటీ, 6న శంశల్లాపూర్, 7న వడ్డీ, 9న బిడెకన్న, 12న మాచ్నూర్‌లో జాతర ముగింపు ఉంటుందన్నారు. ఈ జాతర ఉత్సవాల్లో ప్రతిఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వ్యాన్ బోల్తా, 400 కోళ్లు మృతి

● రూ.2 లక్షల నష్టం, ● రామాయంపేట పాత హైవేలో ఘటన


రామాయంపేటలో బోల్తా పడ్డ కోళ్ల వ్యాన్


రామాయంపేట, జనవరి 13: రామాయంపేట శివారు పాత హైవేలో కోళ్ల వ్యాన్ బోల్తాపడింది. ఈ ఘటనలో సుమారు 400 కోళ్లు చని పోగా రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లింది. ఇసన్నపల్లి శివారు పౌల్ట్రీఫామ్ నుంచి కోళ్లను వ్యాన్‌లో లోడ్ చేసు కుని హైదరాబాద్ తీసుకువె ళ్తున్న క్రమంలో శనివారం అదుపుతప్పి పల్టీ కొట్టింది. దీంతో వ్యాన్‌లోని కోళ్లన్నీ మృత్యువాతపడగా డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కాగా విషయం తెలుసుకున్న స్థానికులు చనిపోయిన కోళ్లను ఎత్తుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అన్న పెద్ద కర్మ రోజే.. తమ్ముడి మృతి


ఖదీర్(ఫైల్)

పాపన్నపేట, జనవరి 13: అన్న పెద్ద కర్మ రోజే.. తమ్ముడు మృతిచెందాడు. పాపన్నపేట మండలం మల్లంపే టకు చెందిన గాండ్ల చోటిబీ, హుషం దంపతులకు యాదుల్, ఖదీర్(27), ఫర్హానా సంతానం. పిల్లలు చిన్నగా ఉన్నప్పుడే తండ్రి హుషం మృతిచెందాడు. అప్పటి నుంచి తల్లి చోటీబీ పిల్లలను పెంచి పెద్దచేసింది. కూతురు ఫర్హానాను పోడ్చన్‌ప ల్లికి చెందిన నబీకి ఇచ్చి వివాహం చేసింది. రెండేళ్ల క్రితం నబీ కుటుంబసభ్యులతో సెల్ఫీ వీడియో తీసుకుంటూ విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి ఫర్హానా కూడా తల్లి వద్దనే ఉంటుంది. కాగా పెద్ద కొడుకు యాదుల్ 40 రోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందాడు. శనివారం ఆయన 40 రోజుల కార్యక్రమం జరగాల్సి ఉన్నది. ఈ క్రమంలో బంధువులు ఇంటికి చేరుకుంటున్నారు. అదే సమయంలో చిన్న కుమారుడు ఖదీర్(27) కూడా గుండెపోటుతో మృతిచెందాడు. అన్న పెద్ద కర్మరోజే తమ్ముడు కూడా మృతిచెందడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొన్నది. మృతుడికి కొడుకు ఉన్నాడు. కాగా భార్య ప్రస్తుతం గర్భిణి. ఖదీర్ మృతి విషయం తెలుసుకున్న మిత్రులు, గ్రామస్థులు, నాయకులు కలిసి రూ.2.5 లక్షలను పోగుచేసి మృతుడి కుటుంబానికి అందజేశారు.

ప్రభుత్వ ఆసుపత్రి నుంచి వ్యక్తి అదృశ్యం


సాయికుమార్ (ఫైల్)

సంగారెడ్డి క్రైం, జనవరి 13: సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఓ వ్యక్తి శనివారం అదృశ్యమైనట్లు పట్టణ సీఐ ఎన్.శ్రీధర్‌రెడ్డి తెలిపారు. గుమ్మడిదల మండలం అన్నారంకు చెందిన తలారి సాయికుమార్(25) ఈనెల 10న ఫిట్స్ రావడంతో బంధువులు సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న క్రమంలో శనివారం ఉదయం 5 గంటల ప్రాంతంలో సాయికుమార్ మూత్రానికి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. అతని బంధువులు ఆస్పత్రి చుట్టుపక్కల, సంగారెడ్డి పరిసర ప్రాంతాల్లో వెతికినా ఎటువంటి జాడ కనిపించలేదు. దీంతో సాయికుమార్ సోదరి భాగ్యలక్ష్మి సంగారెడ్డి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసు కుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

దుర్గాభవానీ ఆలయంలో హుండీ చోరీ


చోరీకి గురైన హుండీని పరిశీలిస్తున్న పోలీస్

కోహీర్ జనవరి 13: కోహీర్ మండలంలోని నాగిరెడ్డి పల్లి గ్రామంలో గల దుర్గాభవానీ ఆలయంలో శుక్ర వారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండ గులు చొరబడి హుండీని ఎత్తుకెళ్లారు. హుండీని ఎత్తుకె ళ్లిన దుండగులు అందులోని నగదును తీసుకుని గ్రామ శివారులోని ఓ ప్రాంతంలో పారవేసి వెళ్లిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు. చోరీకి గురైన హుండీలో దాదాపు రూ.50 వేల వరకు నగదు ఉండొచ్చని పేర్కొ న్నారు. శనివారం ఉదయం విషయం తెలుసుకున్న కోహీర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, వివరా లను తెలుసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అన్ని క్రీడలకు వేదిక సిద్దిపేట: ఎమ్మెల్యే


పోటీలను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, జనవరి 13: సిద్దిపేట అన్ని క్రీడలకు నెలవుగా మారిందని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శని వారం సాయంత్రం సిద్దిపేట అర్బన్ మండలం ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాలలో నేషనల్ టార్గెట్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు, స్విమ్మింగ్ పోటీలు, వాలీబాల్ పోటీలకు సిద్దిపేట వేదికైందన్నారు. 15 రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులకు సిద్దిపేటలో టార్గెట్ బాల్ పోటీలు జరగడం గర్వంగా ఉన్నదని చెప్పారు. టార్గెట్ బాల్ అసోసియేషన్ వారు సిద్దిపేటలో మొదటి యూత్ ఫెస్టివల్ ఏర్పాటు చేయడం, టార్గెట్ బాల్ పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉన్నదని పేర్కొన్నారు.

నేడే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల ఫైనల్

● గజ్వేల్‌లో హోరాహోరీగా సాగుతున్న కబడ్డీ పోటీలు

గజ్వేల్, జనవరి 13: గజ్వేల్‌లో నిర్వహిస్తున్న 49వ రాష్ట్రస్థాయి జూని యర్ కబడ్డీ క్రీడా పోటీలు గజ్వేల్ పట్టణంలో హోరాహోరీగా సాగుతు న్నాయి. ఈ క్రీడల సెమీఫైనల్స్ ఫైనల్స్ ఆదివారం జరుగనున్నాయి. నాకౌట్ దశలో మ్యాచ్‌లన్నీ టైట్‌గా సాగాయి. ఆదివారం ఉదయం బాలి కల విభాగంలో నల్గొండ-వరంగల్, గద్వాల-నాగర్‌కర్నూలు, మేడ్చల్-జ నగాం, ఆసిఫాబాద్-సూర్యాపేట, రంగారెడ్డి-మహబూబ్‌నగర్, హనుమ కొండ-వనపర్తి, మహబూబాబాద్-సిద్దిపేట, నిజామాబాద్-కరీంనగర్‌లు తలపడనున్నాయి. వీటిలో గెలిచిన జట్లు సెమీస్‌లో గెలిచిన జట్లు ఫైనల్లో తలపడనున్నాయి. ఇక బాలుర విభాగంలో లీగ్ దశ నుంచి నాకౌట్ దశకు 16 జట్లు చేరుకున్నాయి. రంగారెడ్డి-నారాయణపేట, ఆదిలాబాద్-కరీంన గర్, సంగారెడ్డి-భూపాలపల్లి, కొత్తగూడెం-నాగర్‌కర్నూల్, నల్గొండ-మహ బూబ్‌నగర్, యాదాద్రి-సూర్యాపేట, మెదక్-మేడ్చల్, ఖమ్మం-గద్వాల్‌లు ఆదివారం ఉదయం తలపడనున్నాయి. ఈ నాకౌట్‌లో గెలిచిన జట్లు సెమీస్‌లో, సెమీస్‌లో గెలిచిన రెండు జట్లు ఫైనల్లో తలపడనున్నాయి.

అంగరంగ వైభవంగా గోదాదేవి కల్యాణం

● వర్గల్, నాచగిరి ఆలయాల్లో నిర్వహణ


నాచగిరి క్షేత్రంలోని ఈరాబాయమ్మ తోటలో గోదాదేవి రంగనాయక స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

వర్గల్, జనవరి 13: జిల్లాలో అత్యంత ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన వర్గల్ మండలంలోని నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం, వర్గల్ వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవం సందర్భంగా గోదా దేవి రంగనాయకస్వామివారి కల్యాణం శనివారం అంగరంగ వైభ వంగా నిర్వహించారు. నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో దేవా దాయ శాఖ ఆలయ కార్య నిర్వహణాధికారి అన్నపూర్ణ పర్యవేక్ష ణంలో ఉదయం 10.30 గంటలకు దేవతామూర్తులైన గోదాదేవి రంగనాయకస్వామివారి ఉత్సవమూర్తులను ఆలయం నుంచి మేళ తాళాలు, మంగళ వాయిద్యాల మధ్యన ఊరేగింపు నిర్వహించి ఆలయ సమీపంలోని ఈరాబాయమ్మ తోటలో సర్వాంగ సుందరంగా అలంకరింపజేసిన కల్యాణ వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ అర్చకులు వేదమంత్రోశ్చరణల మధ్య దేవతామూర్తులకు కల్యాణం నిర్వహించారు. అలాగే వర్గల్ వేణుగోపాలస్వామి ఆలయంలో వేదపండితులు వేదాంతం మురళీధరచార్యుల నేతృత్వంలో గోదాదేవి రంగానాయక స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఈ వేడుకలు భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి

● సెరికల్చర్ జాయింట్ డైరెక్టర్ అజయ్‌గుప్తా ● చాట్లపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



చాట్లపల్లిలో వికసిత్ భారత్‌లో సంలక్పయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

జగదేవ్‌పూర్, జనవరి 13: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథ కాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని సెరికల్చర్ జాయింట్ డైరెక్టర్ అజయ్‌గుప్తా అన్నారు. శనివారం మండ లంలోని చాట్లపల్లి గ్రామంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ సంయుక్తాధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వ హించారు. ముందుగా కేంద్ర ప్రభుత్వం ప్రవే శపెడుతున్న పథకాల గురించి ప్రజలకు వివ రించారు. అనంతరం ప్రధానమంత్రి ఉజ్వల యోజన ద్వారా మంజూరైన గ్యాస్ కనెక్షన్లను, మండల సమాఖ్యకు రూ.2 కోట్ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావే శంలో అజయ్‌గుప్తా, అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ మాట్లా డుతూ కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుతున్నాయో.. లేదో అని సంకల్పయాత్ర ద్వారా తెలుసుకుంటున్నట్లు పేర్కొన్నారు. డీఆర్డీఏ పీడీ జయదేవ్, డీఏవో శివప్రసాద్, డీఎంహెచ్‌వో కాశీనాథ్, సర్పంచ్ నరేష్, ఎంపీపీ బాలేషంగౌడ్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీ టీసీ కావ్యాదర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

మెదక్‌లో టెన్త్ మూల్యాంకన కేంద్రాన్ని ఏర్పాటు చేయండి



ఎమ్మెల్యే రోహిత్‌రావుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న తపస్ జిల్లా నాయకులు

మెదక్ అర్బన్, జనవరి 13: మెదక్ జిల్లా కేంద్రంలో పదవ తరగతి మూల్యాంకన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుకు తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లం, చల్లా లక్ష్మణ్ ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత కొన్ని జిల్లా కేంద్రాల్లో మూల్యాంకన కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. ఉమ్మడి జిల్లా కేంద్రమైన మెదక్‌లో ఇప్పటి వరకు మూల్యాంకన కేంద్రం ఏర్పాటు కాలేదన్నారు. మెదక్ నుంచి బీహెచ్ఈఎల్‌కు వెళ్లి ఉపాధ్యాయులు మూల్యాంకన విధులు నిర్వహించాల్సి వస్తుందన్నారు. ఈ ఏడాది పది మూల్యాంకన కేంద్రాన్ని మెదక్‌లో ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరగా.. సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు

● ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు

పటాన్‌చెరు రూరల్, జనవరి 13: ముత్తంగి గ్రామంలో సంక్రాంతి పండుగ సంబురాల్లో భాగంగా శనివారం సంగారెడ్డి జిల్లా బీజేపీ నాయకురాలు గడ్డ పుణ్యవతి అధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు మాజీ జడ్పీటీసీ శ్రీకాంత్‌గౌడ్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పటాన్‌చెరు వైస్ ఎంపీపీ స్వప్న, బీజేపీ రాష్ట్ర నాయకులు దేవేందర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ గడ్డి యాదయ్య పాల్గొన్నారు.

●జిన్నారం: జిన్నారం పరిధిలోని హెటిరో పరిశ్రమలో మహిళా ఉద్యోగులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. హెటిరో గ్రూప్ చైర్మన్, రాజ్యసభ ఎంపీ బండి పార్థసారథిరెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పరిశ్రమ డైరెక్టర్ మోహన్‌రెడ్డి, ప్రతినిధులు రవిబాబు పాల్గొన్నారు.

●గుమ్మడిదల: బొంతపల్లి గ్రామంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. దాదాపు రెండు వందల మంది మహిళలు పోటీలో పాల్గొన్నారు. విజేతలకు సర్పంచ్ ఆలేటి నవీన్‌శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ సద్ది ప్రవీణభాస్కర్ రెడ్డి, ఉప సర్పంచ్ సంజీవరెడ్డి, ఎంపీటీసీ నాగేందర్ గౌడ్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు ఆలేటి శ్రీనివాస్ రెడ్డి, సద్ది విజయభాస్కర్‌రెడ్డి, భద్రప్ప, వార్డు సభ్యులు సురభి వినోద్‌గౌడ్, నాయకులు చక్రపాణి, గోపాల్, బిక్షపతిరెడ్డి బహుమతులను అందజేశారు.

●చిన్నశంకరంపేట: చిన్నశంకరంపేట మండల పరిధిలోని చందంపేట గ్రామ శివారు ఎమ్ఎస్ఎన్ పరిశ్రమలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం మహిళలు ఆట పాటలతో సందడి చేశారు.

●తూప్రాన్: తూప్రాన్ పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ కమాన్ వద్ద శ్రీగణేశ్ గల్లీకా అసోసియేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. న్యాయనిర్ణేతగా చేగుంట హైస్కూల్ హెచ్ఎం నీరజా వ్యవహరించారు. అనంతరం పోటీల్లో విజేతలైన మహిళలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.





చందంపేట, బొంతపల్లి గ్రామాల్లో నిర్వహించిన పోటీల్లో ముగ్గులు వేస్తున్న మహిళలు



తూప్రాన్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో వేసిన సీతారాముల చిత్రాలు

ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి, తదితరులు

జహీరాబాద్, జనవరి 13: జహీరాబాద్ పార్లమెంట్ స్థానానికి త్వరలో జరిగే ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి విజయమే లక్ష్యంగా పని చేయాలని జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని అతిథి ఇన్‌లో జహీరాబాద్ పార్లమెంట్‌కు సంబంధించి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయమే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలు, నాయకులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా పనిచేసి జహీరాబాద్ పార్లమెంట్‌లో బీజేపీ జెండాను ఎగరవేద్దామన్నారు. కార్యక్రమంలో డీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి, జహీరాబాద్ పార్లమెంటరీ ప్రభారీ మైపాల్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ రవిగౌడ్, వరంగల్ పార్లమెంట్ ఇంచార్జి మురళీధర్‌గౌడ్, నాయకులు బాణాల లక్ష్మారెడ్డి, సుభాష్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖేడ్‌లో సర్వధర్మ సమ్మేళనం



సమ్మేళనంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ ఎంపీ సురేష్ షెట్కార్

నారాయణఖేడ్, జనవరి 13: స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎమ్మెల్యే శివ్‌రావు షెట్కార్ 28వ వర్ధంతిని పురస్కరించుకుని ఖేడ్‌పట్టణ శివారులోని ఆయన ఘాట్ వద్ద శనివారం సర్వధర్మ సమ్మేళనం నిర్వహించారు. శివ్‌రావు షెట్కార్ ఘాట్ వద్ద ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులు మాజీ ఎంపీ సురేష్ షెట్కార్, జిల్లాప్రణాళిక మండలి మాజీసభ్యులు నగేష్ షెట్కార్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్, మాజీ జడ్పీటీసీ సంగీతజితేందర్‌నాథ్ షెట్కార్, కాంగ్రెస్ స్పోక్స్‌మెన్ గిరిజషెట్కార్, సాగర్ షెట్కార్, విజయ్‌కుమార్‌షెట్కార్, ఆనంద్‌స్వరూప్ షెట్కార్, శ్రీనివాస్, తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శివ్‌రావు షెట్కార్ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనడమే కాకుండా, భాష ప్రతిపాదికన రాష్ట్రాల విభజన కోసం, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా అప్పారావుషెట్కార్‌తో కలిసి పోరాటాలు చేసిన గొప్ప మహనీయుడన్నారు. కార్యక్రమంలో అఖిల భారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి సంగ్రాం మహరాజ్, బాల్కి హీరేమఠ్ పీఠాధిపతి మహాలింగ పట్టదేవర, టీపీసీసీ సభ్యులు శంకరయ్య స్వామి, శ్రీనివాస్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరరెడ్డి, కౌన్సిలర్లు ఆనంద్ స్వరూప్ షెట్కార్, దారం శంకర్, వివేకానంద్, రాజేష్‌చౌహాన్, నర్సింలు, మాజీ జడ్పీటీసీ శారదభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేజీకేఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి

సంగారెడ్డి రూరల్/జోగిపేట/హత్నూర: కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శనివారం సంగారెడ్డిలోని తన నివాసంలో ఆవిష్కరించారు. హత్నూర మండల పరిధిలోని నస్తీపూర్ గ్రామ శివారులో గల రామాలయం ఆవరణలో కల్లు గీత కార్మిక సంఘం క్యాలెండర్‌ను సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్నగౌడ్ ఆవిష్కరించారు. జోగిపేట డివిజన్ కల్లు గీత కార్మిక సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను జోగిపేట ఎక్సైజ్ సీఐ సుబ్రహ్మణ్యం, జోగిపేట పోలీస్ ఎస్ఐ అరుణ్‌కుమార్‌గౌడ్ ఆవిష్కరించారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

నారాయణఖేడ్: పద్మశాలీ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంఘం నాయకులతో కలిసి ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి ఆవిష్కరించారు.

ఊర్లకు వెళ్లే వారు జరభద్రం

హవేళిఘనపూర్: సంక్రాంతి పండుగకు ఊర్లకు వెళ్లే ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ ఆనంద్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్టేషన్‌లో శనివారం ఆయన మాటాడారు. ప్రయాణాలు చేసే వారు విలువైన వస్తువులను బ్యాంకులో గానీ, తమ వెంటగాని తీసుకువెళ్లాలన్నారు. ఎవరైన అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు.

వసుధకు డాక్టరేట్

పటాన్‌చెరు రూరల్: గీతం విశ్వవిద్యాలయం కె.వసుధకు డాక్టరేట్‌ను ప్రకటించింది. హైదరాబాద్‌లోని ఐటీ సంస్థలలో సంస్థ యొక్క సుస్థిరతపై పర్యావరణ హిత మానవ వనరుల నిర్వహణ అభ్యాసాల ప్రభావంపై అధ్యయనం చేసినందుకు డాక్టరేట్‌ను అందజేసింది.

పోలీస్ స్టేషన్ తనిఖీ

నాగల్‌గిద్ద: నాగల్‌గిద్ద పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఖేడ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల వివరాలతో పాటు రికార్డులను పరిశీలించారు.

మట్టి టిప్పర్ పట్టివేత

మనోహరాబాద్: అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకుని, కేసు నమోదు చేసినట్లు శనివారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. రంగాయపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను రంగాయపల్లి శివారులో పోలీసులు పట్టుకుని, సీజ్ చేసినట్లు తెలిపారు.

మంత్రి దామోదర్ చొరవతో

మోడల్ స్కూల్‌కు రూ.36 లక్షలు



నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రకటిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

జోగిపేట, జనవరి 13: మండలంలోని అక్సాన్‌పల్లి మోడల్ స్కూల్‌కు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి దామోదర్ రాజనర్సింహ రూ.36 లక్షలు మంజూరు చేశారు. పాఠశాలలోని కొన్ని గదులు దెబ్బతినడం, పాఠశాల మొత్తానికీ పెయింట్ లేకపోవడంతోపాటు, హాస్టల్ నిర్మాణం అసంపూర్తిగా ఉండడాన్ని గమనించిన మంత్రి.. మరమ్మతులకు రూ.36 లక్షలు మంజూరు చేశారు. ఈ మేరకు ఆదివారం ఉదయం సంగారెడ్డిలోని తన నివాసంలో అక్సాన్‌పల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులను పిలిచి పాఠశాల కోసం రూ.36 లక్షలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. సమస్యను తెలుసుకుని నిధులు మంజూరు చేసిన మంత్రికి సహకార సంఘం మాజీ వైస్ చైర్మన్ మహేశ్‌గౌడ్, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు రమేశ్, శివకుమార్, గుడ్ల క్రిష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి అదృశ్యం

జహీరాబాద్/తూప్రాన్, జనవరి 13: జహీరాబాద్ మండలంలోని రంజోల్‌కు చెందిన తలారి కిష్టయ్య(48) డిసెంబరు 8న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. శనివారం భార్య స్వరూప ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జహీరాబాద్ రూరల్ ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. అలాగే మండలంలోని తొట్టి తండాకు చెందిన రాథోడ్‌జైసింగ్(40) గతేడాది ఆగస్టు 1న జహీరాబాద్‌కని చెప్పి వెళ్లి తిరిగిరాలేదు. అతడి భార్య సుశీలభాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. తూప్రాన్ మండలం యావాపూర్ గ్రామానికి చెందిన నవ్య కొంపెల్లిలోని చర్మాస్ షోరూంలో పనిచేస్తున్నది. ఈ నెల 10న తూప్రాన్ మార్కెట్ వెళ్తున్నట్లు పక్కింటికి చెందిన మహిళకు చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. ఈ మేరకు శనివారం ఆమె భర్త నర్సింహులు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.

చైనా మాంజాను అమ్మితే చర్యలు

చిన్నశంకరంపేట/చేగుంట, జనవరి 13: చైనా మాంజ అమ్మితే దుకాణ యజమానులపై చర్యలు తీసుకుంటామని ఫారెస్ట్ నార్సింగి బీట్ ఆఫీసర్ గబ్బర్‌సింగ్ హెచ్చరించారు. శనివారం చిన్నశంకరంపేట, నార్సింగి మండల కేంద్రాల్లో గాలిపటాలను విక్రయిస్తున్న దుకాణాలను తనిఖీ చేశారు. చైనా మంజాతో కలిగే నష్టం గురించి వివరించారు. చైనా మాంజాను ప్రభుత్వం నిషేధించిందన్నారు. చైనా మాంజా దారం అమ్మితే రూ.10 వేల జరిమానాతో పాటు 3 నెలల జైలు శిక్ష విధిస్తామని హెచ్చరించారు. ఆయనవెంట కార్యక్రమంలో ఫారెస్ట్ ఆఫీసర్ రమేష్, నవీన్, సుప్రియ, రాములు ఉన్నారు.

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ

గుమ్మడిదల/వెల్దుర్తి, జనవరి 13: గుమ్మడిదల మండల కేంద్రంలో శనివారం అయోధ్య రామ మందిర అక్షింతలను సర్పంచ్ నరసింహారెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు పడమటి లక్ష్మారెడ్డి, రామ భక్తులు పంపిణీ చేశారు. వెల్దుర్తి మండల పరిధిలోని చర్లపల్లిలో హన్‌మాన్ ఆలయంలో అయోధ్య రాముడి అక్షింతలకు ప్రత్యేక పూజలు చేసి, ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, నాయకులు మహిపాల్‌రెడ్డి, మల్లరెడ్డి పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయం



నర్సాపూర్‌లో క్రికెట్ ఆడి, పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే సునీతారెడ్డి



రుద్రారం ప్రీమియర్ లీగ్ విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

● నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, జనవరి 13: గ్రామీణ ప్రాంత యువతలో దాగి ఉన్న ప్రతిభను ప్రోత్సహించేందుకు క్రీడాపోటీలు నిర్వహించడం అభినందయమని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్ జూనియర్ కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంటును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడలతో క్రమశిక్షణతో పాటు మానసిక ప్రశాంతత దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మున్సిపల్ చైర్మన్ నయీముద్దీన్, జడ్పీటీసీ బబియానాయక్, కౌన్సిలర్లు అశోక్‌గౌడ్, రాంచందర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శేఖర్, నాయకులు సత్యంగౌడ్, సురారం నర్సింహులు, వెంకట్, బాలరాజు, దావూద్, నగేష్, ఆంజనేయులు, జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహపూర్వక వాతావరణం

పటాన్‌చెరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే క్రీడా పోటీల ద్వారా స్నేహపూర్వక వాతావరణం వెల్లివిరిస్తుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. రుద్రారంలో ఏర్పాటు చేసిన రుద్రారం ప్రీమియర్ లీగ్ సీజన్ క్రికెట్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. నియోజకవర్గ వ్యాప్తంగా క్రీడలను ప్రోత్సహించడంతో పాటు క్రీడాకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సుధీర్‌రెడ్డి, ఎంపీటీసీలు మన్నే రాజు, హరిప్రసాద్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాండు, నాయకులు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో ఖిజార్‌యాపై గోల్డ్‌కప్ టోర్నమెంట్

జహీరాబాద్: జహీరాబాద్‌లో ఖిజార్‌యాపై గోల్డ్‌కప్ క్రికెట్ టోర్నమెంట్ వారం రోజులుగా కొనసాగుతున్నది. వివిధ ప్రాంతాలకు చెందిన 20జట్లు పోటీల్లో తలపడగా సంగారెడ్డి ధారాసింగ్, శేఖాపూర్‌సీసీ జట్లు ఫైనల్‌కు చేరినట్లు టోర్నమెంట్ ప్రతినిధి రాములునేత, నాయకులు మోతీరాం, జహంగీర్, యూనూస్, విజయ్ తెలిపారు. నేడు ఫైనల్ మ్యాచ్ ఉంటుందన్నారు. విన్నర్ జట్టుకు రూ.5,55,555, రన్నర్ జట్టుకు రూ.3,33,333 నగదు, ట్రోఫీని అందజేయనున్నట్లు తెలిపారు.

భక్తులతో కిటకిటలాడిన పలు ఆలయాలు



ఖేడ్ నుంచి రేజింతల్‌కు దిండి యాత్రగా తరలివెళ్తున్న వారీకార్ భక్తులు



చిన్నశంకరంపేటలోని నారాయణదాసు మఠం వద్ద భజన సంకీర్తనలు చేస్తున్న భక్తులు

నారాయణఖేడ్, జనవరి 13: నారాయణఖేడ్ మండల పరిధిలోని కొండాపూర్ హనుమాన్ ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. సంక్రాంతి సెలవులు కావడంతో స్వామివారి దర్శనానికి కర్ణాటక, కామారెడ్డి ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో తెల్లవారు జామున అభిషేకం, అలంకరణ, మహాహారతి కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్ భక్తులకు ఆశీస్సులు అందజేశారు.

రేజింతల్‌కు దిండి యాత్ర

నారాయణఖేడ్: న్యాల్‌కల్ మండలం రేజింతల్‌లోని సిద్ధివినాయక ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన వారీకార్ భక్తులు దిండి యాత్రను ప్రారంభించారు. వామన్‌రావు మహరాజ్ ఆధ్వర్యంలో కాశీనాథ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భజనలు, కీర్తనలు చేస్తూ తులసీ కోటలు తలలపై ధరించి పాదయాత్రగా రేజింత్‌లకు బయలుదేరారు. వారికి గ్రామాల్లో ప్రజలు ఘన స్వాగతం పలికారు.

నారాయణదాసు ఆరాధన మఠం వార్షికోత్సవం

చిన్నశంకరంపేట: మండల కేంద్రంలోని అనంత పద్మనాభ గుట్ట ఆవరణలోని బ్రహ్మానంద నారాయణదాసు ఆరాధన మఠం 41వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం మఠం వద్ద గణపతి పూజతో మొదలుపెట్టి పారాయణ, ఆరాధన, కుంకుమార్చన పూజా కార్యక్రమాలు నిర్వహిచారు. భక్తులు భజన సంకీర్తనలతో మఠం ఆవరణ మార్మోగింది. ఉత్సవాల్లో ఆలయ కమిటీ నిర్వాహకులు జాలదాసు, వెంకట్‌గౌడ్, సంఘమేశ్వర్ పాల్గొన్నారు.

ఆలయాల్లో ఎమ్మెల్యేల పూజలు

నారాయణఖేడ్/ఝరాసంగం: నారాయణఖేడ్ పట్టణంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి పూజలు నిర్వహించారు. ఝరాసంగం మండలం బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమంలో కామారెడ్డి ఎమెల్యే వెంకటరమణారెడ్డి పూజలు నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి వైరాగ్య శిఖమణి అవధూత గిరి మహరాజ్ ఆయనను ఘనంగా సన్మానించారు.

స్టోన్‌క్రషర్‌ను తొలగించాలని ఆందోళన



స్టోన్‌క్రషర్ వద్ద ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జిన్నారం, జనవరి 13: అసైన్డ్ భూమిలో స్టోన్‌క్రషర్ ఏర్పాటు చేశారని ఆరోపిస్తూ మాదారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేశారు. శనివారం మాదారం కాంగ్రెస్ నాయకుడు రాజుగౌడ్ ఆధ్వర్యంలో స్థానిక క్రషర్ వద్ద బైఠాయించి ఆందోళన చేశారు. మాదారం, కాజీపల్లి గ్రామాల శివారులో సర్వే నెంబర్ 145, 146, 210లో గల అసైన్డ్ భూమిలో నిబంధనలకు విరుద్ధంగా స్టోన్‌క్రషర్ ఏర్పాటు చేశారన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు సత్యనారాయణ, క్రిష్ణ, నర్సింహ, లక్ష్మన్, రాకేష్, ఆంజనేయులు, సంతోష్, నర్సింగరావులు ఉన్నారు.

దరఖాస్తుల డాటా ఎంట్రీ 70 శాతం పూర్తి

గుమ్మడిదల, జనవరి 13 : గుమ్మడిదల మండలంలో ప్రజాపాలన దరఖాస్తుల డాటా ఎంట్రీ కార్యక్రమం 70 శాతం పూర్తయినట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న డాటా ఎంట్రీ కార్యక్రమాన్ని పరిశీలించి తగు చూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 13 గ్రామ పంచాయతీలలో ప్రజాపాలన కార్యక్రమంలో దాదాపు పదివేలు దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇప్పటివరకు 6 వేల దరఖాస్తుల డాటా ఎంట్రీ పూర్తయిందన్నారు. మిగతా 4 వేలు దరఖాస్తుల డాటా ఎంటీ రెండు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు.

'పెండింగ్ చలాన్లను చెల్లించండి'

వెల్దుర్తి, జనవరి13: పెండింగ్ చలాన్లను త్వరగా క్లియర్ చేసుకోవాలని హెడ్‌కానిస్టేబుల్ లాయక్‌అలీ సూచించారు. శనివారం వెల్దుర్తిలోని బస్టాండ్ చౌరస్తా వద్ద ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 31 వరకు పెండింగ్ చలానాల చెల్లింపుకు రాయితీ ఇచ్చిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి వాహనాదారుడు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమాజానికి చేసే సహాయం ఎంతో గొప్పది

పాపన్నపేట, జనవరి 13: సమాజానికి మనం చేసే సహాయం ఎంతో గొప్పదని మెదక్‌జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ పేర్కొన్నారు. పాపన్నపేట మండలం మిన్పూర్ లిటిల్‌ఫ్లాక్ చర్చ్ ఆధ్వర్యంలో వృద్ధులకు శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న పేదలకు, వృద్ధులకు, పారిశుధ్య కార్మికులు దుప్పట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో లిటిల్ ఫ్లాక్ చర్చ్ పాస్టర్ డాక్టర్ బి.దాస్, పాస్టర్ బి.దినకర్, పాస్టర్ వరప్రసాద్, గ్రామ సర్పంచ్ ఎం.లింగారెడ్డి, ఎంపీటీసీ వడ్ల కుబేరుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలతో నిరుపేదలకు మేలు

వెల్దుర్తి, జనవరి13: గ్రామాలల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరాలతో నిరుపేదలకు ఎంతో మేలు కలుగుతుందని మాజీ జడ్పీటీసీ ఆంజనేయులు అన్నారు. శనివారం మండల కేంద్రమైన వెల్దుర్తి గ్రామ పంచాయతీలో ఆక్సివిజన్ లేజర్ కంటి ఆసుపత్రి మేడ్చల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రోగులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు సురేష్, ఖాజా, సౌజన్య తదితరులు ఉన్నారు.

ఉపాధి నిమిత్తం ఎస్సీ యువతకు ఉచిత శిక్షణ

సంగారెడ్డి రూరల్, జనవరి 13: ఎస్సీ నిరుద్యోగ యువతకు కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు స్కిల్ డెవలప్‌మెంట్ ట్రెయినింగ్ సెంటర్ బ్రాంచ్ మేనేజర్ ఆసిఫా బేగం శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణలో భాగంగా ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ కోర్సులను మూడు నెలల వ్యవధిలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వీటితో పాటు ఆంగ్లం టైపింగ్, ఎంఎస్ ఆఫీస్, డీసీఏ, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్, సీసీ కెమెరాల పర్యవేక్షణపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కోర్సుల్లో చేరేందుకు పదవ తరగతి ఉత్తీర్ణులై వయో పరిమితి 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల వరకు ఉన్నవారు అర్హులన్నారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల వారు సంగారెడ్డిలోని స్ఫూర్తి డిగ్రీ కళాశాల పక్కన ఉన్న సంస్థ కార్యాలయంలో నేరుగా సంప్రదించాలని ఆమె కోరారు. వివరాలకు 8309940165 నంబరులో సంప్రదించాలన్నారు.

కనుల పండువగా గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణం

● మెదక్‌లో నిర్వహించిన మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

మెదక్ అర్బన్, సంగారెడ్డి అర్బన్, హవేళిఘణపూర్, జనవరి 13: గోదాదేవి కల్యాణం శనివారం అట్టహాసంగా జరిగింది. ఈ కల్యాణంలో ప్రముఖులతో పాటు భక్తులు భారీగా పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని బాలజీమఠంలో ధనుర్మాసోత్సవాల్లో అత్యంత కీలక మట్టమైన శ్రీగోదాదేవి రంగనాథస్వామి కల్యాణ మహోత్సవాన్ని శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారి ఆలయం నుంచి గోదాదేవి అమ్మవారిని భక్తులు మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. ఆలయ అర్చకులు, వేద పండితుల మంత్రోచ్ఛరణలతో మధ్య కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ మహోత్సంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పాల్గొన్ని పూజలు చేశారు. అనంతరం స్వామి వారి పల్లకి సేవలో పాల్గొన్నారు. అనంతరం రోహిత్‌రావు పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కౌన్సిలర్లు లక్ష్మీనారాయణగౌడ్, ఆర్కెశ్రీను, చందనసుమన్, మాజీ కౌన్సిలర్లు విజయలక్ష్మి, జ్యోతి, మంగ రమేష్‌గౌడ్, నాయకులు ఉప్పల రాజేష్, జీవన్‌రావు, నరేందర్, బోస్, పోచేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● సంగారెడ్డి: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సంగారెడ్డి శివారులోని శ్రీవైకుంఠపురం ఆలయంలో శనివారం గోదా రంగనాథస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా జరిగింది. ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మారుమోగింది. కల్యాణోత్సవ మహోత్సవంలో ట్రైబల్ వెల్ఫేర్ సెక్రటరీ డాక్టర్ శరత్ దంపతులు పాల్గొన్నారు. కాగా భక్తులు పెద్ద సంఖ్యలో కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ నెల 14న ఏకాంతసేవ, 15న సర్వమంగళా దేవీ ఆశీర్వాదంతో కార్యక్రమాలు ముగుస్తాయని ఆలయ ప్రధాన అర్చకులు కందాడై వరదాచార్యులు తెలిపారు.

● హవేళిఘణపూర్: మండలంలోని కూచన్‌పల్లి గ్రామంలోని వెంకటేశ్వస్వామి ఆలయంలో గోదాదేవి రంగనాథ స్వామి కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. భక్తులు భారీగా తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు.



మెదక్‌లోని బాలాజీమఠంలో స్వామి వారి పల్లకీ సేవలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు



సంగారెడ్డిలో నిర్వహించిన కల్యాణోత్సవంలో పాల్గొన్న ట్రైబల్ వెల్ఫేర్ సెక్రటరీ శరత్ దంపతులు



కూచన్‌పల్లిలో హారతులు ఇస్తున్న మహిళలు